


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ శనివారం 24-02-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 51 పేజీలు : 4 వెల : రూ 2-00


## తెలంగాణలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను శుక్రవారం బదిలీ చేసింది. సిద్దిపేట కలెక్టర్‌గా పనిచేస్తున్న ప్రశాంత్ జీవన్ పాటిల్ నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సిద్దిపేట కొత్త కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి నియమితులయ్యారు. ప్రస్తుతం మను చౌదరి కామారెడ్డి జిల్లాలో అదనపు కలెక్టర్‌గా ఉన్నారు. వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న షేక్ రియాజ్ బాషాను జనగాం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు.పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖల ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న శైలజా రామయ్యర్‌కు అదనంగా రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు అదనపు హోదాలో ఈ బాధ్యతలను పర్యవేక్షిస్తున్న సునీల్ శర్మను ఈ బాధ్యతల నుంచి తప్పించారు.

# మేడారంలో అమ్మవార్లను దర్శించుకున్న గవర్నర్

**గద్దెల వద్ద కేంద్రమంత్రి ముండాతో కలిసి పూజలు**
**నిలువెత్తు బంగారం సమర్పణ**





ములుగు,ఫిబ్రవరి23 ): మేడారం సమక్క - సారమ్మ మహా జాతర వైభవంగా జరుగుతోంది. ఇప్పటికే పెద్దసంఖ్యలో భక్తులు మేడారంకు చేరుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. శుక్రవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ , కేంద్ర మంత్రి అర్జున్ ముండా మేడారం చేరుకుని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్, కేంద్రమంత్రి నిలువెత్తు బంగారం సమర్పించి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తమిళిసై, అర్జున్ ముండా వనదేవతలను దర్శించుకున్నారు.దర్శనానంతరం గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని సమ్మక్క సారలమ్మను కోరానని తెలిపారు. ఇది గొప్ప జాతర అని కొనియాడారు. లక్షల కొద్దీ ప్రజలు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారని తెలిపారు. 'నేను గవర్నర్‌గా మూడోసారి మేడారం జాతరకు రావడం నా అదృష్టం' అని గవర్నర్ తమిళిసై హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశంలోనే అతిపెద్ద ఆదివాసి జాతర అని కేంద్రమంత్రి అర్జున్ ముండా అన్నారు. పలు రాష్ట్రాల నుంచి భక్తులు, ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారన్నారు. సమ్మక్క సారలమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందని కేంద్రమంత్రి అన్నారు. కాగా.. సమ్మక్క-సారలమ్మల నామస్మరణతో మేడా రం మహా జాతర ప్రాంగణం మార్మోగుతోంది. అమ్మవార్లకు పసుపు, కుంకుమ, ఎత్తు బంగారాలను భక్తులు సమర్పిస్తున్నారు. ఇప్పటికే గ్దదెలపైకి సమక్క సారలమ్మ లు చేరుకోవడంతో అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివ స్తున్నారు. ఈనెల 21 నుంచి జాతర ప్రారంభమవగా.. నాలుగు రోజుల పాటు వనదేవతల జాతర జరుగనుంది. తిరిగి అమ్మవార్ల వనప్రవేశంతో జాతర ముగియనుంది.

# వన దేవతలను దర్శించుకున్న సీఎం రేవంత్



ములుగు: మేడారంలో సమ్మక్క, సారలమ్మలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకు న్నారు. ఆసియాలో అతిపెద్ద గిరిజన పండుగ..తెలంగాణ కుంభమేళాగా ఖ్యాతిగాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు భక్తులు తండోపతండాలుగా తరలి వస్తున్నారు.నిన్న మేడారంలో కీలక ఘట్టం ప్రారంభమైంది. సమ్మక్క తల్లి గద్దెపై కొలువు దీరింది. సమ్మక్కను ప్రధాని పూజారి ప్రతిష్ఠించారు. వనదేవతల్ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు.చిలకలగుట్టనుంచి సమ్మక్క తల్లి మేడారం గద్దెపైకి చేరడంతో మహాజాతర పరిపూర్ణత సంతరించుకుంది. ఇప్పటికే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరడంతో భక్తుల మొక్కులు జోరందుకున్నాయి. గురువారం రాత్రి చిలకలగుట్టనుంచి పూజారులు, వడ్డెలు సమ్మక్కను భక్తుల జయజయధ్వానాల నడుమ తీసుకొచ్చి గద్దెపె ప్రతిష్ఠించారు. దారిపొడవునా డోలు వాయిద్యాలు, ఆదివాసీల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పూనకాలతో శివసత్తులు ఊగిపోయారు. జై సమ్మక్క.. జైజైసమ్మక్క. తల్లీ శరణు.. జయహో జగజ్జనని.. సల్లంగాచూడు తల్లి అంటూ భక్తుల నామస్మరణ మార్మోగింది.గద్దెల వద్ద ప్రత్యేక పూజలు..తెలంగాణ కుంభమేళా మేడారం జాతరలో ప్రధాన ఘట్టం సమ్మక్క ఆగమనం. తల్లిరాకతోనే జాతర సంపూర్ణమవుతుంది. కాగా, గురువారం మేడారంలోని సమ్మక్క గుడి శక్తిపీఠం వద్ద పూజారులు, వడ్డెలు సంప్రదాయ దుస్తులు ధరించి కుంకుమ, పసుపు, ఇతర పూజాసామగ్రిని పట్టుకొని గద్దెల వద్దకు చేరి ప్రత్యేక పూజలు చేశారు. సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజుకు పసుపు కుంకుమ అప్పగించిన తర్వాత పూజారులు చిలకలగుట్టకు చేరుకున్నారు.

# 27వ తేదీన రెండు హామీల అమలు ప్రారంభం...

**రూ.2 లక్షల రుణమాఫీపై త్వరలోనే రైతులకు శుభవార్త**
**సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతోనే తెలంగాణలో**
**ఇందిరమ్మ రాజ్యం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



మంది సమక్షంలో వారికి నియామక పత్రాలు ఇచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగాలు ఇచ్చినా ఇవ్వలేదంటూ మామాఅల్లుళ్లు,తండ్రీకొడుకలు తమ ప్రభుత్వంపై గోబెల్స్‌లా అబద్ధపు, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో యువకులకు ఉద్యోగాలు కల్పించేందుకు పది స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. × త్వరలోనే ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌ను నియమిస్తాం...త్వరలోనే ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌ను నియమిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తాము అధికారంలోకి వచ్చి వంద రోజులు కాలేదని, పదేళ్లు ఓపిక పట్టారని, త్వరలోనే జర్నలిస్టుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వాన్ని తేవడంతోనే జర్నలిస్టుల పని అయిపోలేదని కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టడానికి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. వాళ్లు ఇద్దరి (బీజేపీ-బీఆర్ఎస్‌ను ఉద్దేశించి) సమన్వయం మీకు తెలుసని, ఉదయం, సాయంత్రం మాట్లాడుకుంటున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. పది సీట్లు బీజేపీకి, ఏడు సీట్లు కేసీఆర్‌కు మాట్లాడుకొని ఎన్నికలకు రాబోతున్నారని, ఆ చీకటి ఒప్పందాన్ని మీడియా మిత్రులు తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. × సమ్మక్క-సారలమ్మల స్ఫూర్తితో....సమ్మక్క-సారలమ్మ ఆశీర్వాదంతోనే తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మంచి వర్షాలు పడి పాడిపంటలతో ప్రజలు విలసిల్లాలని, తెలంగాణలోని నాలుగు కోట్ల ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని సమ్మక్క సారలమ్మను వేడుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంతో, ఈ ప్రాంత శాసనసభ్యురాలు, మంత్రి సీతక్కతో తనకున్న వ్యక్తిగత అనుబంధం.. రాజకీయంగా తామిద్దరం కలిసి చేసిన ప్రయాణం అందరికీ తెలుసని ముఖ్యమంత్రి అన్నారు. తాము ఏ ముఖ్య కార్యక్రమం తీసుకున్నాఇక్కడ సమ్మక్క-సారలమ్మ ఆశీస్సులు తీసుకొనే మొదలుపెట్టామన్నారు. 2023, ఫిబ్రవరి ఆరో తేదీన హాత్ సే హాత్ జోడోను ఇక్కడ నుంచే ప్రారంభించామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రజా తీర్పు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటుంది.. కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వ ఏర్పడుతుందని తాము ఆనాడే చెప్పామన్నారు. రాబోయే సమ్మక్క సారలమ్మ జాతరను భక్తులకు అసౌకర్యం కలగకుండా, అన్నిరకాల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించి చేస్తామని ఆనాడే చెప్పామని, అలానే చేశామన్నారు. అమ్మల ఆశీస్సులతో సీతక్క, కొండా సురేఖ మంత్రులయ్యారని, తమందరికీ వివిధ హోదాలు, బాధ్యతలు వచ్చాయనన్నారు. ఆ బాధ్యతతోనే సుమారు ఒక కోటి యాభై లక్షల మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగొద్దని, ఏర్పాట్లలో లోపం ఉండదనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం రూ.110 కోట్లను జాతరకు కేటాయించిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికలు పూర్తికాగానే జాతరపై దృష్టి పెట్టాల్సి రావడంతో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను బృందంగా ఏర్పాటు చేసి సమన్వయంతో పనులు చేయించినట్లు చెప్పారు. ఆడ బిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడమే తమ ప్రభుత్వ తొలి నిర్ణయమని, జాతరకు ఆడ బిడ్డలు పెద్ద ఎత్తున వస్తున్న నేపథ్యంలో ఆరు వేల ఆర్టీసీ బస్సులతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేశామని, అన్ని డిపోల నుంచి బస్సులను ఇక్కడి పంపాలని ఆదేశించడంతో పాటు అదనంగా వంద కొత్త బస్సులు కొనుగోలు చేసి జాతరకు వాటిని వినియోగించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో 18 కోట్ల మంది ఆడ బిడ్డలు ఉచిత బస్సులు వినియోగించుకున్నారని, జాతరకు లక్షలాది మంది మహిళలు వచ్చేందుకు ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగపడిందని ముఖ్యమంత్రి అన్నారు. సమ్మక్క-సారలమ్మ అంటేనే పోరాట స్ఫూర్తి అని, ప్రజలపై ఆధిపత్యం చలాయించాలనుకున్న, ప్రజలను పీడించైనా పన్నులు వసూలు చేయాలనుకున్న రాజులను పేదలు, ఆదివాసీ బిడ్డలైన తల్లీబిడ్డలు, తండ్రీ కొడుకులు అంతా కలిసికట్టుగా పోరాడారని ఆయన కొనియాడారు. బడుగుల, ఆదివాసీల పక్షాన కొట్లాడి నేలకు ఒరిగినందునే వందల సంవత్సరాలైనా సమ్మక్క సారలమ్మను దేవుళ్లుగా కొలుస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. తమను నమ్ముకున్న ప్రజల కోసం నిలబడి పాలకులతో కొట్లాడినందుకు అమరులై వారు దేవతలుగా వెలిశారని ముఖ్యమంత్రి శ్లాఘించారు.

# మరో ఘోర రోడ్డు ప్రమాదం

**ఓఆర్ఆర్‌పై రెయిలింగ్‌ను ఢీకొన్న కారు**
**యువ ఎమ్మెల్యే లాస్యనందిత మృత్యువాత**
**వరుస ప్రమాదాలను తట్టుకున్నా వెన్నాడినమృత్యువు**
**సిఎం రేవంత్, మాజీ సిఎంకెసిఆర్ తదితరుల తీవ్ర దిగ్భ్రాంతి**



హైదరాబాద్,ఫిబ్రవరి23( : మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓయువ మహిళానేత ప్రమాదంలో దుర్మరణం చెందారు. వరుస ప్రమాదాలను ఎదుర్కొంటూ వచ్చిన ఆమెను మృత్యువు జయిస్తూ వచ్చారు. చివరకు మృత్యువే జయించింది. కారు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత కన్నుమేశారు. ఎన్నో ఆశలతో తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని అసెంబ్లీలో అడుగు పెట్టిన ఆమెను మృత్యువు నిలనీయలేదు. నీవెంటే నేను అంటూ వెంటాడి చంపింది. చివరకు ఏడాదిలోపే తండ్రి దగ్గరకు లాస్య నందిత చేరుకున్నారు. ఇక వివరాల్లోకి వెళితే.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత(37) శుక్రవారం తెల్లవారుజామున జరిగిన కారు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారు పటాన్‌చెరు ఓఆర్ఆర్ వద్ద ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె పీఏ ఆకాశ్, డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఎమ్మెల్యే భౌతిక కాయాన్ని పటాన్‌చెరు ఆస్పత్రికి తరలించారు. ఇటీవల ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విషయం తెలిసిందే. నల్గొండలో భారాస బహిరంగసభకు హాజరై తిరిగి వస్తుండగా నార్కట్‌పల్లి సమీపంలోని చెర్లపల్లి వద్ద ఆమె ప్రయాణిస్తున్న కారును ఆటో ఢీకొట్టింది. ఇంతలోనే మరో రోడ్డు ప్రమాదంలో ఆమె ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది డిసెంబర్‌లో సికింద్రాబాద్‌లో ఓ కార్యక్రమానికి వెళ్లిన లాస్య లిఫ్టులో ఇరుక్కుపోయిన సంగతి తెలిపిందే. ఓవర్‌లోడ్ కారణంగా లిఫ్ట్ కిందకి పడిపోవడంతో అందులో చిక్కుకుపోయారు. ఇలా వరుస ప్రమాదాలు వెన్నాడినా బతికిబయటపడ్డారు. చివరకు జరిగిన ప్రమాదంలో ప్రాణాలు దక్కించుకోలేక పోయారు. దివంగత నేత సాయన్న కుమార్తె లాస్య నందిత. గతేడాది ఫిబ్రవరి 19న సాయన్న మృతి చెందారు. ఏడాది కాలంలోనే తండ్రి, కూతురు మృతి చెందడం.. ఆ కుటుంబంలో తీవ్ర విషాదంనింపింది. 1987లో హైదరాబాద్‌లో జన్మించిన లాస్య నందిత.. కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేశారు. 2015లో రాజకీయాల్లోకి వచ్చారు.కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు.

## అమిత్ షా తెలంగాణ టూర్ ఫిక్స్..

# పార్లమెంట్ ఎన్నికలే టార్గెట్‌గా..!



పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో బీజేపీ పార్టీ ఇతర రాష్ట్రాలతో పాటు తెలంగాణ లోనూ మరింత దూకుడు పెంచింది. తెలంగాణలో 10 రోజుల పాటు సాగే విజయ సంకల్ప్ యాత్రతో లోక్ సభ ఎన్నికల కోసం మొదటి దశ ప్రచారాన్ని ఇప్పటికే ప్రారంభించి మంచి జోష్ మీద ఉంది.ఈ యాత్రను నాలుగు వేర్వేరు ప్రాంతాలకు చెందిన పార్టీ సీనియర్ నేతలు ఒకేసారి జెండా ఊపి ప్రారంభించి ప్రజల్లోకి వెళ్లారు. అయితే ఈ నెల 24న హైదరాబాద్ లో జరిగే విజయ్ సంకల్ప్ యాత్రలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొనబోతున్నారు. అమిత్ షా రాకతో విజయ్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాలు చురుగ్గా సాగనున్నాయి. అయితే తొలి దశ ప్రచారం ముగిసిన తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణలో పర్యటించి బహిరంగ సభలో ప్రసంగించే అవకాశాలున్నాయి. అయితే తేదీ, స్థలం ఇంకా ఖరారు కాలేదు.ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలలో ఆకట్టుకునే స్ట్రైక్ రేట్ తో, బిజెపి తన ఓట్ల శాతాన్ని దాదాపు ఏడు శాతం మెరుగుపరుచుకుంది. లోక్ సభ ఎన్నికలకు ఓటర్ల ఆదరణ పరంగా బీజేపీ తమ ప్రత్యర్థులైన కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల కంటే చాలా ముందంజలో ఉందని చెప్పక తప్పదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 13.90 శాతం ఓట్లు సాధించి 8 అసెంబ్లీ సెగ్మెంట్లను గెలుచుకుంది. అదే ఊపుతో లోక్ సభ స్థానాలను కైవసం చేసుకోవాలనుకుంటుంది. లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కు ముందే 'ముందస్తు ప్రచారం' మైలేజ్ పొందడానికి 'విజయ్ సంకల్ప యాత్ర'ను ప్రారంభించింది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, కేంద్రమంత్రులు బీఎల్ శర్మ, పురుషోత్తం రూపాలా సహా పార్టీకి చెందిన ప్రముఖ జాతీయ నాయకులు 'విజయ్ సంకల్ప్ యాత్రలను' ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర శాఖ తెలంగాణను ఐదు క్లస్టర్లుగా విభజించి ప్రతి క్లస్టర్ కు 'స్టార్ లీడర్స్'ను కేటాయించి ఆయా ప్రాంతాల్లో ప్రచార యాత్రను నడిపించింది.ఉమ్మడి ప్రాజెక్టులను కేంద్ర నియంత్రణలో ఉన్న కేఆర్ఎంబీకి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఇటీవల నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహించినప్పటికీ, చుట్టూ పెద్దగా కార్యకలాపాలు కనిపించడం లేదు. కాంగ్రెస్ కూడా పెద్దగా యాక్టివ్ గా లేదు. కానీ బీజేపీ సంకల్ప యాత్రతో ముందుంది. ఇక అయోధ్య రామమందిర లాంటి అంశాన్ని తీసుకొని తెలంగాణ బీజేపీ ప్రజల్లోకి వెళ్లి ఆకట్టుకోబోయే వ్యూహంలో ఉంది.

# ఢిల్లీ లిక్కర్ కేసు కీలక మలుపు

**కేసులో ఇదితురాలిగా ఎమ్మెల్సీ కవిత**
**26న విచారణకు రావాలని సిబిఐ నోటీసులు**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి23 : ఢిల్లీ లిక్కర్ కేసు కీలక మలుపు తిరిగింది. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను నిందితురాలిగా సీబీఐ చేర్చింది. ఈ మేరకు కవితకు సీబీఐ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 26న విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో పాటు కవితను కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉందని సీబీఐ వర్గాలు అంటున్నాయి. ఇదే కేసుల ఇప్పటికే కవితను మూడుసార్లు సీబీఐ ప్రశ్నించింది. 2022లో ఇదే కేసులో సీబీఐ ప్రశ్నించింది. లిక్కర్ కేసులో నిందితురాలిగా సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీ చేసింది. గతంలో ఇచ్చిన నోటీసులను సవరిస్తూ తాజాగా మరోసారి సీబీఐ నోటీసులిచ్చింది. దర్యాప్తు తర్వాత కవితను నిందితురాలిగా సీబీఐ పేర్కొంది. ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత చుట్టూ ఉచ్చు బిగిస్తోంది. న్యాయమూర్తి ముందు కవిత పీఏ అశోక్ కౌశిక్ సంచలన విషయాలు బయట పెట్టినట్లు సమాచారం. లిక్కర్ కేసులో పలువురికి ముడుపులు అందజేసినట్లు జడ్జి ముందు కౌశిక్ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలిసింది. కవితతో పాటు కౌశిక్‌ని కూడా నిందితుడిగా సీబీఐ పరిగణిస్తోంది. సీబీఐ గతంలో ఇదే కేసుకు సంబంధించి హైదరాబాద్‌లోని కవిత నివాసానికి వచ్చి స్టేట్‌మెంట్ తీసుకున్న విషయం తెలిసిందే. మరోవైపు ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా పలుమార్లు కవితను ప్రశ్నించింది. చివరగా గత ఏడా ది జనవరి 16న విచారణకు రావాల్సిందిగా కవితకు ఈడీ నోటీసులు జారీచేసింది. అయితే ఈడీ విచారణకు సంబంధించి సుప్రీంకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున విచారణకు హాజరుకాలేనంటూ ఆమె లేఖ రాశారు.

## సంపాదకీయం

శనివారం 24-02-2024

# భవిష్యత్ అంతా ఏఐదే

కృత్రిమ మేధ.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్. దీని ప్రభావం ప్రపంచంపై బాగానే పడుతోంది. ఇప్పుడిప్పుడే.. ప్రవేశిస్తున్న ఈ అత్యంత అధునాతన సాంకేతిక వ్యవస్థ ఇప్పటికే చాలా రంగాల్లోకి ప్రవేశించింది. రాబోయే కాలమంతా దీనిదే అంటున్నాయి సర్వేసంస్థలు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉన్న భారత్ వంటి వాటిలో రానున్న మూడేళ్ల కాలంలో అంటే 2027 నాటికి భారీగా వృద్ధి చెందుతుందని నాస్కామ్ అంచనా వేసింది. సాధారణంగా కృత్రిమ మేధ అంటే.. ఇటీవల కాలంలోకొంత ఆందోళనలు చోటు చేసుకున్నాయి. దీనివల్ల ఊడిపోతున్న ఉద్యోగాలు సహా.. మనిషి కన్నా.. 100 రెట్లు ఎక్కువగా ఆలోచన చేస్తుందని.. ఫలితంగా ఇది చెడుకు దారితీస్తుందని మేధావులు సైతం చెప్పుకొచ్చారు. అయితే.. ఏ వ్యవస్థలో అయినా.. మంచి, చెడు రెండు ఉంటాయి. ఇప్పుడు కృత్రిమ మేధలోనూ ఈ రెండు ఉన్నాయనే చెబుతున్నారు. కృత్రిమ మేధ ఆధారిత సేవల మార్కెట్ భారత్‌ఏటా 25-35% వృద్ధిని సాధిస్తుందని నాస్కామ్ తన నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా 2027 నాటికి ఏఐ మార్కెట్ దేశీయంగా 17 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.41 లక్షల కోట్ల) స్థాయికి చేరుతుందని వివరించింది. టెక్నాలజీ బడ్జెట్ కేటాయింపులు పెరగడం, మానవ వనరుల లభ్యత, ఏఐ సేవలకు ప్రాధాన్యం పెరుగుతుందని విశ్లేషించింది. 'ఏఐ పవర్డ్ టెక్ సర్వీసెస్' పేరుతో ఈ నివేదికను కన్సల్టింగ్ సేవల సంస్థ అయిన బీసీజీతో కలిసి నాస్కామ్ ఆవిష్కరించింది. ప్రపంచ వ్యాప్తంగా ఏఐ రంగంలోకి పెట్టుబడులు ఏటా 24% పెరుగుతున్నాయి. 2023లో 83 బిలియన్ డాలర్ల (సుమారు రూ.6.89 లక్షల కోట్ల) పెట్టుబడులను ఈ రంగం ఆకర్షించింది. ప్రధానంగా డేటా అనలిటిక్స్, జెన్‌ఏఐ, మెషీన్ లెర్నింగ్, ఆల్గోరిథమ్ అండ్ ప్లాట్‌ఫామ్స్ విభాగాల్లోకి అధికంగా పెట్టుబడులు వస్తున్నాయిమనదేశంలో ఐటీ కంపెనీలు డిజిటల్ కంటెంట్, డేటా అనలిటిక్స్ సప్లై చైన్ రంగాలకు నిధులు ఎక్కువగా కేటాయిస్తున్నాయి. కొన్ని కంపెనీలు కేవలం ఏఐని వినియోగించడమే కాదు.. తమ సేవల తీరును సరికొత్తగా మారుస్తున్నాయి. మన దేశంలో 4.2 లక్షల మంది ఏఐ నిపుణులు ఉన్నారు. ఏటా ఈ నిపుణుల సంఖ్య పెరుగుతోంది. ఈ విషయంలో ప్రపంచంలోని అగ్రశ్రేణి-5 దేశాల జాబితాలో మనదేశం ఒకటి. ఏఐపై పెట్టుబడులు పెరుగుతున్నందున, ఏఐ నిపుణుల అవసరాలు పెరుగుతాయని నాస్కామ్ వెల్లడించింది. నిపుణుల సంఖ్య ఏటా 15% పెరగాల్సిన అవసరం ఉన్నట్లు పేర్కొంది. దీన్ని పరిగణనలోకి తీసుకునే, ఐటీ కంపెనీలు తమ సిబ్బందిలో ఏఐ నైపుణ్యాలు పెంపొందించడానికి చర్యలు తీసుకుంటున్నాయి. కొన్ని సంస్థలు వచ్చే మూడేళ్లలో బిలియన్ డాలర్ల (సుమారు రూ.8,300 కోట్ల)కు పైగా నిధులు ఖర్చు చేయడానికి సిద్ధపడుతున్నాయి.ఏఐ పరిజ్ఞానంతో ఐటీ కంపెనీలు తమ వినియోగదార్లకు కొత్త సేవలు ఆవిష్కరించడంతో పాటు అదనపు విలువను జోడించగలుగుతున్నాయని నాస్కామ్ ప్రెసిడెంట్ దేబ్‌జానీ ఘోష్ వివరించారు. ఏఐ వినియోగంలో భద్రత, నైతిక విలువలకూ ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. లేకపోతే.. మంచి కన్నా.. చెడుకు అవకాశం ఎక్కువగా ఉంటుందనే హెచ్చరికలు కూడా వస్తున్నాయి. మరో వైపుప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న టెక్నాలజీ కొత్త అవకాశాలను అందిస్తుంది. అయితే ఇటీవల కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మాత్రం ప్రజలను భయపెడుతుంది. ఏఐ వల్ల ఉద్యోగాలు తీవ్రంగా ప్రభావితం అవుతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే కొంత మంది మాత్రం ఏఐను సరిగ్గా నిర్వహిస్తే చాలా ప్రయోజనాలు ఉంటాయని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఏఐపై పెద్దస్థాయిలో పరిశోధనలు సాగుతున్నాయి. కానీ ఇటీవల ఓ వార్త మాత్రం ఏఐ వల్ల కలిగే నష్టాలను వివరిస్తుంది. ముఖ్యంగా ఏఐను నియంత్రించే అవకాశం మానవులకు ఉండదని, అదే జరిగితే మానవ మనుగడకే ఏఐ వల్ల ముప్పు సంభవిస్తుందని పేర్కొంటున్నారు. ప్రఖ్యాత ఏఐ భద్రతా నిపుణుడు డాక్టర్ రోమన్ వీ యాంపోలిస్కీ తన రాబోయే పుస్తకం ఏఐ అన్‌ఎక్స్‌పాండబుల్, అన్ ప్రిడిక్టబుల్, అన్ కంట్రోలబుల్ అనే పుస్తకంలో ఏఐ వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ పుస్తకం కృత్రిమ మేధస్సు ద్వారా ఎదురయ్యే సంభావ్య ప్రమాదాల గురించి తెలియజేస్తుంది. ప్రస్తుత సాంకేతికత దాని సురక్షితమైన, నైతిక ఉపయోగాన్ని నిర్ధారించడానికి రక్షణగా లేదని డాక్టర్ యాంపోలిస్కీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యాంపోలిస్కీ రచించిన పుస్తకంలో ఏఐ వల్ల కలిగే నష్టాలను ఓ సారి తెలుసుకుందాం.డాక్టర్ యాంపోలిస్కీ ఏఐకు సంబంధించిన విస్తృతమైన పరిశోధన ఈ పుస్తకంలో ప్రచురించారు. మానవ సామర్థ్యాలను అధిగమించిన తర్వాత సూపర్-ఇంటెలిజెంట్ ఏఐను మనం నియంత్రించగలమనే కచ్చితమైన రుజువు లేదని పేర్కొంటున్నారు. ఈ "అస్తిత్వ ముప్పు" అతను దానిని పిలుస్తున్నట్లుగా పెద్దదిగా ఉంది. తనిఖీ చేయకుండా వదిలేస్తే వినాశకరమైన పరిణామాలకు అవకాశం ఉంది. ఈ పుస్తకంలో ఏఐకు సంబంధించిన స్వయంప్రతిపత్తి, అనూహ్యత ద్వారా ఎదురయ్యే స్వాభావిక సవాళ్లను వివరించారు. ఈ ఫీచర్లు అపారమైన సామర్థ్యాన్ని అందిస్తున్నప్పుడు ఏఐ మానవ నియంత్రణలో ఉందని నిర్ధారించడం కష్టతరం చేస్తుందని పేర్కొంటున్నారు.

# జిఎస్టీతో కుదేలవుతున్న జనం



న్యూఢిల్లీ,ఫిబ్రవరి23: ఐదురాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ఫలితాలు బిజెపికి అనుకూలంగా ఉన్న వేళ రేపటి పార్లమెంట్ ఎన్నికల్లో తమకు ఢోకా లేదన్న ధీమాలో బిజెపి ఉంది. అందుకే సామాన్యుల బాధలు పట్టడం లేదు. సమస్యలు చర్చించడం లేదు. ప్రధానంగా పెట్రోల్ ధరలు పెరగడం...

### భారం తగ్గించడంలో కేంద్రం విఫలం
### ప్రాంతీయ పార్టీలకు పొగపెడుతున్న మోడీ

జిఎస్టీ స్లాబులు పెరగడం లాంటివి భారంగా మారిన చర్చించడం లేదు. రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బతీసి రాజకీయంగా లబ్దిపొందాలన్న దురాలోచనలో కేంద్రం ఉన్నట్లు కనపడుతోందని విపక్ష కాంగ్రెస్ విమర్శిస్తోంది. బయటకు కనిపించకున్నా ఆర్థికంగా అనేక రాష్ట్రాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. తము అనుకున్న రీతిలో రాష్ట్రాలను ఊబిలోకి దించి విద్యుత్, ఆర్థిక సంస్కరణలను అమలు చేయాలన్న ప్రణాళిక వేస్తున్నారు. మోడీ దృష్టిలో ఎంత మేరకు ఆదాయం రాబట్టామనే లెక్కలు వేసుకుంటున్నారు. జిఎస్టీ ఆదాయాన్ని విజయంగా చూస్తున్నారు. దీంతో ప్రజలు పడుతున్న బాధలు కనిపించడం లేదు. అయితే దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానాన్ని ప్రవేశ పెట్టాలనే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వాల కాలం నుంచే మొదలయ్యింది. యూపిఎ హయాంలో జిఎస్టీ తీసుకుని రావాలన్న నిర్ణయాన్ని ఆనాడు ప్రస్తుత బిజెపి పాలకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తుతం ప్రధానిగా ఉన్న మోడీ కూడా గుజరాత్ సిఎం హోదాలో తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది రాష్ట్రాల హక్కులను హరిస్తుందని, ప్రజలపై భారం పడుతుందని వాదించారు. కానీ తాను ప్రధాని అయ్యాక దీనిని బలవంతంగా ప్రజలపై రుద్దారు. ఇప్పుడు జిఎస్టీతో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామో అనుభవంలోకి వచ్చింది. ఒకేరకమైన పన్ను విధానంతో రకరకాల పన్నులు పోయి ఒకటే విధానం ఉంటుందని,సులభంగా కూడా ఉంటుందని ఆనాడు మోడీ వాదించారు. మోడీ వచ్చాక జిఎస్టీని పట్టుబట్టి అమలు చేయడంతో కేంద్రం పక్కా వ్యాపార ధోరణితో ప్రజల నుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తోంది. వివిధ దేశాలలో ఒకే రకమయిన పన్ను విధానం ఉండడం ప్రపంచీకరణకు అనుకూల వాతావరణాన్ని కలిగిస్తుందన్న భావనతో, పన్ను సంస్కరణలు మొదలయ్యాయి. కానీ అమెరికా వంటి దేశంలో కూడా జిఎస్టికి చుక్కెదురయింది. అక్కడ వారికి ఒకే విధానం కంటె, రాష్ట్రాల ప్రతిపత్తే ముఖ్యం అన్న విధాంలో ఉన్నారు. దీర్ఘకాలం జిఎస్టిపై జరిగిన చర్చలలో రాష్ట్రాల హక్కులకు హాని కలుగకుండా సంస్కరణను ఎట్లా సాధ్యం చేయాలన్న అంశంపై వాదోపవాదాలు జరిగాయి. కొత్త విధానంలోకి మారిన వెంటనే కలిగే నష్టానికి పరిహారం చెల్లిస్తామని కేంద్రం వాగ్దానం చేసింది. జిఎస్టి విధానం అమలు మొదలైన తరువాత, కరోనా ఇబ్బందుల కాలంలోనూ పన్ను వాటా ఆదాయం గణనీయంగా తగ్గిపోయిన సందర్భంలో పరిహారం ఇవ్వడానికి కేంద్రం ఎన్నో మెలికలు పెట్టింది. చివరకు కొంత ఇచ్చింది కానీ, ఇవ్వవలసినంత మాత్రం ఇవ్వలేదు. రాష్ట్రాలను ఇబ్బంది పెట్టడానికి ఆర్థిక కేటాయింపులను వాడడంలో ప్రస్తుత కేంద్రప్రభుత్వం రాజకీయ వ్యూహం చూపుతున్నది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రతిపక్ష రాష్ట్రాల

విషయంలో నిధుల కేటాయింపులు, అనుమతుల విషయంలో పక్షపాతం చూపడం, దానికి ప్రతిస్పందనగానే ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించడం జరిగింది. బిజెపి ప్రభుత్వం, తీవ్రజాతీయత సహాయంతో ప్రాంతీయ శక్తులను బలహీనపరచడానికి, రాష్ట్రాలను పరాధీనం చేయడానికి ప్రయత్నిస్తున్నదని వామపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే పరీక్ష, చివరకు ఒకే ఎన్నికల దాకా పరిస్థితి వెడుతున్నది. జిఎస్టి పరిహారం సందర్భంలో, తాము కోరుతున్న సంస్కరణలను అమలు చేయడాన్ని ఒక షరతుగా పెట్టడం చూశాం. మొత్తం ఆదాయం కేంద్రం నుంచి మాత్రమే రావలసి వస్తే, ఇక రాష్ట్రాలకు సొంత విధానాలు అంటూ ఏమీ మిగలవు. తాజాగా అలాంటి పరిస్థితులు కల్పిస్తున్నారు. రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బతీయడం ద్వారా అక్కడ పాగా వేయాల న్నది మోడీ నేతృత్వంలోని బిజెపి ప్లాన్‌గా ఉంది. ప్రజల్లో ప్రాంతీయ పార్టీలను చులకన చేసి లేదా మరో రకంగా అధికారం కబ్జా చేయాలని చూస్తున్నారని కాంగ్రెస్, లెఫ్ట్ నేతలు ఆరోపిస్తున్నారు. జిఎస్టీ సవరణలు కోరినా పట్టించుకోవడం లేదు. అలాగే ఇటీవల చేనేతపైనా భారీగా జిఎస్టీ పెంచాలని చూశారు. అయితే రాష్ట్రాలు వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారు. జిఎస్టీ వల్ల కలుగుతున్న ఇబ్బందులను తర్కించి, చర్చించాలని ఆయా పార్టీలు కోరినా లాభం లేకుండా పోతోంది.

# విభజన హామీలు గాలికొదిలిన జగన్

అమరావతి,ఫిబ్రవరి23 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అమలు పరచడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సానుభూతి ప్రకటిస్తున్నారా లేక..కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తున్నారా అన్నది అర్థం కావడం లేదు. అయితే గత పదేళ్లుగా మోడీ మాత్రం ఇంచు మాత్రం సాయం కూడా చేయకుండా కాలం గడపడంలో విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన తీరు గురించి, కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి గురించి మోదీ తరచూ విమర్శలు చేస్తూనే ఉన్నారు. అయితే కాంగ్రెస్ చేసిన ఆ తప్పును సరిచేసేందుకు గత పదేళ్ళలోనూ దేశ ప్రధానిగా, సభానాయకుడిగా తాను ఎందుకు ప్రయత్నం చేయలేదో మోదీ ఎప్పుడూ చెప్పలేదు. ఈ క్రమంలో ఎపిలో బిజెపిని ఆదరించాలని కోరుకుంటున్నారు. కొన్ని సీట్లను సాధిస్తే రాజకీయాలు తమ గుప్పిట్లో ఉంటాన్న ప్రయత్నాల్లో ఉన్నారు. ఎన్‌డిఎలోకి టిడిపి చేరితే కొంత పరిస్థితి మెరుగు పడగలదన్న ఆలోచనలో స్థానిక నేతలు కూడా ఉన్నారు. టిడిపి, జనసేనలతో కలసి వెళితే ఓ ఐదారు అసెంబ్లీ సీట్లు కొట్టేయవచ్చని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని ద్వేషించాలంటే, విభజన సమస్యలను పరిష్కరించకుండా సజీవంగా ఉంచడం ముఖ్యమని, తద్వారానే తన రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవచ్చునని బీజేపీ భావిస్తుందన్న భావన కూడా వ్యాప్తిలో ఉంది. అందుకే విభజిత ఆంధప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక స్థితికి ఊతమిస్తుందనుకొన్న పోలవరం, ప్రత్యేక హోదా అమలు విషయంలో ప్రత్యేక ప్యాకేజి నాటకానికి తెరతీసింది. విభజనపై జరిగిన అన్యాయాలపై సుప్రీంలో పిటిషన్ వేసి కొట్లాడాలని, పార్లమెంటులో చర్చ చేయాలని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ పదేపదే కోరుతున్నా ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. ఉండవల్లి మాటలను ఎవరూ ఖాతరు చేయడం లేదు. కనీసం ఆయనతో చర్చించడానికి కూడా ఎవరు ముందుకు రావడం

### మోడీ ప్రాపకం కోసం నేతల తాపత్రయం
### ఒత్తిడి పెంచడంలో కానరాని చిత్తశుద్ది

లేదు. ఎపి ఆర్థికస్థితి దివాళా తీయడానికి జగన్ పాలాన తీరు కూడా కొంత కారణంగా చూడాలి. డబ్బుల పందేరంతో ఖజానాను దెబ్బతీసారు. అనవసర పథకాలతో డబ్బును ఊడ్చేశారు. మరోవైపు సాయం చేయాల్సిన బిజెపి నేతలు ఆర్థిక దివాళా గురించి పదేపదే ఎద్దేవా చేస్తున్నారు. అమరావతి లక్ష్యం వెనక్కి పోయింది. మొత్తంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు రావణకాష్ఠంలా మండుతూనే ఉన్నాయి. ఇదే సమయంలో తన రాజకీయ ప్రయోజనాలను బీజేపీ ఉపయోగించుకుంటోంది. ఇకపోతే అధికార, ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. అలాగే పరస్పర నిందారోపణలతో కాలం గడపటం వల్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ఉమ్మడిగా పోరాడాలన్న రాజకీయ స్ఫూర్తి లేకపోవడంతో పదేళ్లు గడిచినా కేంద్రం నుంచి సాధించేది ఏమీ లేదని నిరూపించారు. విభజన తర్వాత ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పుల పంపకాలకు సంబంధించిన సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడానికి సైతం మోదీ సర్కార్ కృషి చేయలేదు. కొన్ని ఆస్తుల పంపకం విషయంలో వాటాలు కుదరక ఇరు రాష్ట్రాలు వివిధ న్యాయస్థానాలను ఆశ్రయించినా కేంద్రం ప్రేక్షకపాత్ర మాత్రమే వహించింది. త్రిసభ్య కమిటీ కూడా ఎలాంటి పురోగతి చూపలేకపోయింది. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు పార్లమెంటులో ఇచ్చిన హామీలలో ఒక్కదాన్ని కూడా మోదీ ప్రభుత్వం సక్రమంగా అమలు చేయలేదు. ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, కడప ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వే జోన్, దుగ్గరాజపట్నం పోర్టు, కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్స్, వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్, నిధుల లోటు భర్తీ, వెనుకబడిన జిల్లాలకు, ప్రాంతాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజి... ఇలా ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ఉన్నత విద్యాసంస్థలను మాత్రం ప్రారంభించి, వాటిలో మౌలిక సదుపాయాల కోసం నిధులను విడతల వారీగా విడుదల చేస్తోంది. మిగతా హామీల అమలుకు పార్లమెంటు సాక్షిగా వాటి అమలుకు మాకు పది సంవత్సరాలు సమయం ఉందని సమాధానం చెప్పి తప్పించుకున్నది. జాతీయ ప్రాజెక్టులకు అందే ప్రయోజనాలు కూడా పోలవరం విషయంలో అందడం లేదు. విభజన వల్ల, రాజధాని కోల్పోవడం వల్ల నష్టపోతున్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడానికి ప్రత్యేక హోదా ఇవ్వడమే పరిష్కారమని పార్లమెంటు ఉభయ సభలలో అధికార, ప్రతిపక్ష సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. అధికార కాంగ్రెస్ ఐదేళ్లు మాత్రమే హోదా ఇస్తామంటే ప్రతిపక్ష బీజేపీ పదేళ్లు ఇవ్వాలని పట్టుపట్టింది. చివరకు ప్రకటించిన విధంగా ఐదేళ్ల ప్రత్యేక హోదా కూడా ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్‌ను మోదీ ప్రభుత్వం వంచించింది. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయడానికి ప్రత్యేక హోదా ఇస్తే కేంద్ర ప్రాయోజిత పథకాలలో అదనంగా వచ్చే 30శాతం నిధులు ప్రత్యేకంగా ఇస్తామని ప్యాకేజీ క్రింద ప్రకటించింది. ఆంధప్రదేశ్‌లో పార్లమెంటు సభ్యులు-అధికారం, ప్రతిపక్షం రెండుగా చీలిపోయి ప్రత్యేక హోదా రాకపోవడానికి కారణం మీరంటే మీరంటూ నిందించుకొంటూ, అసలు కారణం అయిన మోదీని, బీజేపీ ప్రభుత్వాన్ని మాత్రం ఉమ్మడిగా నిలదీయలేకపోయారు. దీంతో నష్టపోతున్నది మన రాష్ట్రమే అని వారు గుర్తించకపోవడంతో మోడీకి కలసి వస్తోంది. అలాగే పోటీపడి మోడీ ప్రాపకం కోసం ఇప్పుడు నేతలు సాగిలపడుతున్నారు.

# బైజూస్ కు ఆగని కష్టాలు

ముంబై, ఫిబ్రవరి 23, (న్యూస్ పల్స్)భారతీయ స్టార్టప్ రంగానికి పోస్టర్ బాయ్‌గా నిలిచిన బైజూస్‌కు సమస్యలు రోజురోజుకూ ఎక్కువవుతూనే ఉన్నాయి. ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి కూడా ఇబ్బంది పడుతున్న ఈ ఎడ్టెక్ స్టార్టప్ కంపెనీ, ఇప్పుడు తన కార్యాలయాలను మూసేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఇది, బెంగళూరు నుంచి ప్రారంభమైంది.బైజూస్, తన ఖర్చులు తగ్గించుకోవడానికి కార్యాలయ స్థలాన్ని తగ్గించడం ప్రారంభించింది. బెంగళూరులోని ప్రెస్టీజ్ టెక్ పార్క్‌లో ఉన్న 4 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్థలాన్ని ఈ కంపెనీ ఇటీవలే ఖాళీ చేసింది. ఈ కార్యాలయ స్థలం లీజు ఈ సంవత్సరం ప్రారంభంలో రద్దయింది. బకాయి ఉన్న అద్దెను డిపాజిట్ ఉపయోగించి చెల్లిస్తున్నారు. ఇంకా, కొన్ని ఆస్తులకు సంబంధించి సంబంధిత యజమాన్యాలతో వివాదం నడుస్తోందని ఈటీ రిపోర్ట్ చేసింది.బైజూస్ మాతృ సంస్థ థింక్ అండ్ లెర్న్ , బెంగళూరులో ఉన్న ప్రాపర్టీని మూడున్నరేళ్ల క్రితం ప్రెస్టీజ్ గ్రూప్ నుంచి లీజుకు తీసుకుంది. ఈ కార్యాలయ స్థలం కోసం ప్రతి నెలా రూ. 4 కోట్ల అద్దె చెల్లిస్తోంది. ప్రస్తుతం కంపెనీ ఆర్థిక పరిస్థితి అతి భారీగా క్షీణించడం




వల్ల, కొన్ని ఆఫీసుల అద్దెలను సకాలంలో చెల్లించలేకపోతోంది.బెంగళూరులోనే ఉన్న మరో ఆఫీస్ స్పేస్‌పైనా సమస్యలు కమ్ముకున్నాయి. ఇది కళ్యాణి టెక్ పార్క్‌లో, 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. కళ్యాణి డెవలపర్స్ నుంచి ఈ స్థలాన్ని బైజూస్ లీజుకు తీసుకుంది. బైజూస్ గత 10 నెలలుగా ఈ ఆస్తికి అద్దె చెల్లించలేదు. దీంతో, కళ్యాణి డెవలపర్స్, బైజూస్ డిపాజిట్ నుంచి 7 నెలల అద్దెను తీసుకుంది. అంతేకాదు, బైజూస్‌కి లీగల్ నోటీస్ పంపింది.నిధుల విషయంలో బైజూస్‌కు కొంత ఉపశమనం లభించింది. ఇటీవల, ఈ కంపెనీ రైట్స్ ఇష్యూ ప్రారంభించింది. ఈ నెలాఖరులో ఈ ఆఫర్ క్లోజ్ అవుతుంది. బైజూస్, రైట్స్ ఇష్యూ ద్వారా వివిధ పెట్టుబడిదార్ల నుంచి 300 మిలియన్ డాలర్ల వరకు కమిట్‌మెంట్స్ పొందింది. ఈ ఇష్యూ నుంచి 200 మిలియన్ డాలర్లు సేకరించాలన్నది కంపెనీ ప్రయత్నం. దీని కోసం, బైజూస్, తన కంపెనీ విలువను 99 శాతం కుదించి, 220-250 మిలియన్ డాలర్లకు తగ్గించింది. ఈ విలువ ఒకప్పుడు 22 బిలియన్ డాలర్లుగా ఉంది.అంతర్జాతీయ పెట్టుబడి సంస్థ బ్లాక్‌రాక్, ఈ ఏడాది జనవరిలో, బైజూస్ విలువను 1 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. బ్లాక్‌రాక్‌కు బైజూస్‌లో వాటా ఉంది. తన వాటా విలువను లెక్కగడుతూ, బైజూస్ విలువ కేవలం 1 బిలియన్ డాలర్లుగా బ్లాక్‌రాక్ అంచనా వేసింది. 2023 మార్చిలోనూ బైజూస్ విలువలో కోత పెట్టింది. అప్పుడు, సంస్థ విలువను 8.4 బిలియన్ డాలర్లకు కుదిస్తున్నట్లు అమెరికా ఔఇఅకి సమర్పించిన ఫైలింగ్‌లో పేర్కొంది. దీనికిముందు, 2022 డిసెంబర్‌లో, 11.5 బిలియన్ డాలర్లకు కుదించింది. తీవ్రమైన ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న బైజూస్, ఫిబ్రవరి ప్రారంభమైన 4 రోజుల తర్వాత గానీ తన ఉద్యోగులకు జనవరి నెల జీతాలు చెల్లించలేకపోయింది. ఎంతో ప్రయత్నం చేస్తేగానీ జీతాలు ఇవ్వలేకపోయినట్లు బైజూస్ అఖా రవీంద్రన్ స్వయంగా చెప్పడం కంపెనీ కష్టాలకు అద్దం పడుతోంది. ఉద్యోగుల జీతాల కోసం ఈ కంపెనీ నెలకు దాదాపు రూ.70 కోట్లు వెచ్చిస్తోంది. అఖా రవీంద్రన్‌ను కుర్చీ నుంచి దింపేందుకు బైజూస్ ఇన్వెస్టర్లంతా ఏకమయ్యారంటూ ఇటీవల జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. దీనిపై బైజూస్ స్పందించింది, ఇన్వెస్టర్లకు అలాంటి హక్కు లేదని స్పష్టం చేసింది.

# సీటు బెల్టుల ధరించికపోవడం వల్లనే ప్రమాదం

### గతంలో అనేకులు ఇలాగే ప్రమాదానికి గురి

హైదరాబాద్,ఫిబ్రవరి23(:మితిమీరిన వేగం.. సీటు బెల్టు ధరించడంలో నిర్లక్ష్యం.. కారు ప్రమాద మరణాలకు ముఖ్య కారణం. పోలీసులు సీటు బెల్ట్ ధరించకుంటే ఫైన్ వేస్తామని హెచ్చరిస్తున్నా పాటించడం లేదు. సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల ప్రమాదంలో మరణించిన వారి జాబితాలో చాలామందే ఉన్నారు. కారు ఉన్న ప్రతి ఒక్కరికీ సీటు బెల్ట్‌పై పక్కాగా అవగాహన ఉంటుంది. అయినా సరే.. సమయం అలా వస్తుందో ఏమో కానీ సీటు బెల్ట్ మాత్రం ధరించడం లేదు. ప్రమాదంలో ఎవరో ఒక ప్రముఖ వ్యక్తి మరణించినప్పుడల్లా సీటు బెల్ట్ ప్రాధాన్యం గురించి చర్చ జరుగుతూనే ఉంటోంది. తాజాగా ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో మరోసారి సీటు బెల్ట్ అంశం చర్చకు వస్తోంది. వాహనం దేన్నయినా ఢీ కొట్టిప్పుడు కారులోని వ్యక్తులు వేగంగా ముందుకు వెళ్తారు. ఆ సమయంలో వాళ్లు డ్యాష్ బోర్డునో.. వెనుక కూర్చున్నవారైతే ముందు సీట్ల మధ్య నుంచి వెళ్లి అద్దాన్ని వేగంగా గుద్దుకునే ఆస్కారముంటుంది. ఇక వాహనం ఏమైనా పల్టీ కొట్టిందా.. ఏకంగా అద్దంలో నుంచి ముందుకు పడిపోవడం జరుగుతుంటుంది. లేదంటే డోర్ ఊడిపోయి ఒక్కసారిగా ఎగిరి బయట పడిపోతారు. అలా జరిగితే తీవ్ర గాయాలై వ్యక్తి మరణించే అవకాశం ఉంటుంది. సీటు బెల్ట్ ధరించినప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టినా లేదంటే కారు పల్టీలు కొట్టినా పెద్దగా ఇబ్బంది ఉండదు. ముందుగా అద్దంలో నుంచి ముందుకు పడటమో లేదంటే డోర్ ఊడిపోయి ఎగిరి బయట పడటమో జరగదు. ఈ తరుణంలో సీటు బెల్ట్ వారిని రక్షిస్తుంది. సీటు బెల్ట్ పెట్టుకోవడం వల్ల ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ అవుతాయి. దీంతో ప్రమాదం నుంచి సులభంగా గ్గటెక్కవచ్చు. అత్యంత అరుదుగా మాత్రమే ఎయిర్ బ్యాగ్స్ సెన్సార్లు యాక్టివేట్ అయి, తెరుచుకోవడానికి 0.05 సెకన్ల సమయం పడుతుంది. ఇలా జరిగితే ఏమీ చెయ్యలేం. కానీ 99.95 శాతం మాత్రం సీటు బెల్ట్ పెట్టుకుంటే పక్కాగా బయటపడతాం. కొన్ని కార్లలో ముందు కూర్చున్న వారికి మాత్రమే సీటు బెల్ట్ ఉంటుంది. సాధారణంగా ఇప్పుడు కొత్తగా మార్కెట్‌లోకి వచ్చే కార్లలో అన్ని సీట్లకూ సీట్ బెల్ట్ ఉంటోంది. వాహనం ప్రమాదానికి గురైన వెంటనే కారులోని సెన్సర్లు యాక్టివేట్ అయిపోయి ఓ యాంగిల్‌ను ఏర్పరుచుకుంటాయి. ఇవి ఎయిర్‌బ్యాగ్ కంట్రోల్ యూనిట్‌కు సమాచారం అందిస్తాయి.

## సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి కలిసిన కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



సిద్ధిపేట;ఫిబ్రవరి 23(లోకంతీరు):సిద్ధిపేట మునిసిపల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన ప్రసన్న రాణి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యదారి మధు సిద్ధిపేట పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు కోలన్ నరేష్ సిద్ధిపేట పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గయాజుద్దీన్. హబీబ్ లతీఫ్ గడ్డం సంతోష్ గౌడ్ చేపూరి సిద్ధి రాములు గౌడ్ నజ్జు తదితరులు పాల్గొన్నారు

## సామాన్యుడి సంక్షేమానికి కెసిఆర్ పెద్దపీట

**వ్యవసాయరంగంలో తిరుగులేని ఆధిక్యం**

**విమర్శలతో నిజాలు కప్పిపుచ్చలేరు: వేముల**



నిజామాబాద్,ఫిబ్రవరి23 : బిఆర్ఎస్ పాలనలో వ్యవసాయం బాగుపడిందని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. దానిని కొనసాగించే విషయంలో ప్రస్తుత ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. ఉన్న జలాశయాలను వాడుకుని నీటిని పొలాలకు మళ్లించాలన్న దృష్టి పెట్టడం లేదన్నారు. కేవలం చిన్నిచిన్న పొరపాట్లను చూపి, గత పాలనను విమర్శించడం పనిగా పెట్టుకున్నారని ఆయన విమర్శించారు. నిజానికి మల్లన్న సాగర్ సాకారంతో కాళేశ్వరం కల పూర్తిగా సాకారం అయ్యిందన్నారు. తెలంగాణను కోటిఎకరాల మాగాణిగా తీర్చిదిద్దాలని నాటి సీఎం కేసీఆర్ కృషి చేసారని, అద్భుత పాలనతో దేశానికే రోల్ మోడల్గా నిలిచారన్నారు. ప్రస్తుత అధికార కాంగ్రెస్ నేతలు అదేపనిగా విమర్శలు మాని,మల్లన్న సాగర్ను, కొండపోచమ్మ సాగర్ను చూస్తే నీటి రాక ఎలా ఉందో తెలుస్తుందన్నారు. ప్రాజెక్టులకు నిధులతో సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. కాగితం పులులు, సోషల్మీడియాలో దుష్ప్రచారంతో పబ్బం గడుపుతున్న అన్నారు. తమ ప్రభుత్వం ప్రజల కోసమే ఆలోచించే ప్రభుత్వమని రుజువైందని తెలిపారు. అనేక సంక్షేమకార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ఐటీ రంగంలో మెరుగైన ప్రగతిని సాధించుకున్నామని తెలిపారు. హైదరాబాద్ను దేశంలోనే సురక్షితమైన నగరంగా తీర్చిదిద్దామన్నారు. విమర్శలు చేస్తున్న బిజెపి,కాంగ్రెస్ నేతలు తమ పాలనలో ఏం చేసిందో చెప్పాలన్నారు. పెట్రో ధరలు పెంచడం తప్ప బిజెపి చేసిందేమీ లేదన్నారు. కెసిఆర్ హయాంలో పేదల సంక్షేమం కోసం ప్రతి ఏటా రూ. 40వేల కోట్లు కేటాయింపులు చేసినట్లు తెలిపారు. వృద్ధాప్య పెన్షన్ అర్హత 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గింపు చేయడం జరిగిందని, ఒంటరి మహిళలు, దివ్యాంగుల, వితంతువుల పెన్షన్లు రెట్టింపు చేశామన్నారు. రైతులకు ఏడాదికి రూ. పదివేల పంట పెట్టుబడి ఇచ్చామని, అభివృద్ధి సంక్షేమంలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిపామని అన్నారు. అయితే ఈ పదేళ్ల కాలంలో ఏమీ చేయలేదన్న రీతిలో బురదజల్లే కార్యక్రమం చేపట్టడం తగదని అన్నారు. ఇది ప్రజలు కూడా జీర్ణించుకోలేరని అన్నారు. కుల, మతాలతో సంబంధం లేకుండా డబుల్బెడ్ రూం ఇండ్లు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వం దని మాజీమంత్రి అన్నారు. రైతుల అభివృద్ధి కోసం రూ. 50 వేల కోట్లకు పైగా కేటాయించడం గొప్ప విషయమని, తద్వారా రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు నిర్మూలించగలిగామని అన్నారు. వ్యవసాయాన్ని పండగలా మార్చిన ఘనత కేసీఆర్దేనని, తెలంగాణ ఏర్పడితే కరెంట్ ఉండదని సమైక్య పాలకులు భయపెట్టారని, కేసీఆర్ కృషితో 24 గంటల నిరంతర నాణ్యమైన కరెంట్ అందివ్వగలిగామని అన్నారు. చిన్న మండలాలు, జిల్లాల ఏర్పాటుతో అభివృద్ధి ఫలాలు ప్రతిఒక్కరికి అందుతున్నాయని అన్నారు.

## లాస్యనందిత మృతికి మంత్రుల సంతాపం

**ఆమె మృతి తీరని లోటన్న పలువురు నేతలు**

హైదరాబాద్,ఫిబ్రవరి23 : కంటోన్మెంట్ భారాస ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్రెడ్డి, శ్రీధర్బాబు, జూపల్లి కృష్ణారావు సంతాపం ప్రకటించారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తెదేపా అధినత చంద్రబాబునాయుడు ఆమె మృతి పట్ల సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే లాస్య నందిత కుటుంబసభ్యులను మాజీ మంత్రి హరీశ్రావు పరామర్శించారు. పటాన్చెరు ఆస్పత్రికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చారు. తండ్రి సాయన్న చనిపోయిన ఏడాదిలోపే లాస్య నందిత మృతి చెందడం దురదృష్టకరం. ఆమె ముందు ఉజ్వల భవిష్యత్తు ఉండగా, విధి మరొకటి తలచింది. లాస్య నందిత కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. ఆమె శ్రేయోభిలాషులు, స్నేహితుల నుంచి వస్తున్న ప్రేమ, మద్దతు ఆ కుటుంబానికి బలాన్ని చేకూర్చాలని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. వారం క్రితమే లాస్యను కలిసి మాట్లాడాం. ఇంతలోనే ఇలాంటి షాకింగ్, దిగ్భ్రాంతికర వార్త వినాల్సి వచ్చింది. ఇలాంటి కష్ట సమయాల్లో లాస్య కుటుంబ సభ్యులకు, మిత్రులకు నా ప్రగాఢ సానుభూతి అంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా గెలుపొందిన లాస్య మృతి ఎంతో బాధ కలిగించింది.

# ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర క్రియాశీలకం

**శిక్షణ తరగతుల్లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

**నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**





నిజామాబాద్, ఫిబ్రవరి 23(లోకంతీరు) : ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం ఎన్నికల సెక్టోరల్ అధికారులకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా సెక్టోరల్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, పరిశీలించాల్సిన విషయాలపై అంశాల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి నిర్వర్తించాల్సిన విధుల గురించి తెలియజేస్తూ రూపొందించిన హ్యాండ్ బుక్ ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో నెలకొని ఉన్న పరిస్థితులను ముందుగానే గమనిస్తూ, ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారుల దృష్టికి తేవాలని సెక్టోరల్ అధికారులకు సూచించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా ఒకరిద్దరు మినహాయిస్తే సెక్టోరల్ అధికారులు అందరూ సమర్ధవంతంగా విధులు నిర్వర్తించారని అన్నారు. ప్రస్తుతం కూడా అదే స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా పని చేయాలని, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని హితవు పలికారు. ఇదివరకు పని చేసాం కదా అనే భావనతో విధులను ఎంతమాత్రం తేలికగా తీసుకోకూడదని, ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని జాగ్రత్తలు సూచించారు. ఎవరైనా విధుల పట్ల అలసత్వాన్ని ప్రదర్శిస్తూ నిర్లక్ష్యానికి తావిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఏ చిన్న అనుమానానికి సైతం అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికలతో ముడిపడిన విధులు అయినందున తప్పిదాలకు ఆస్కారం కల్పిస్తే, ఎలక్షన్ కమిషన్ చేపట్టే చర్యలకు గురి కావాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా ఈ.వీ.ఎంల విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉంటూ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, పక్కాగా నిబంధనలు పాటించాలని అన్నారు. మాక్ పోల్, పోలింగ్ ప్రక్రియల సందర్భంగా ఎక్కడైనా ఈ.వీ.ఎం లలో సాంకేతిక సమస్య తలెత్తితే, సెక్టోరల్ అధికారులు వెంటనే స్పందించి తమ వద్ద రిజర్వ్ లో ఉంచిన యూనిట్లను సమకూర్చాలని సూచించారు. పోలింగ్ రోజున ఓటింగ్ శాతాన్ని వెంటదివెంట ఎన్ కోర్ యాప్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో తాజా స్థితిగతులలో పాటు, గత ఎన్నికల్లో చోటుచేసుకున్న సంఘటనలు, వివిధ అంశాల ప్రాతిపదికన సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నిర్ణీత గడువులోపు పూర్తి వివరాలతో ప్రాథమిక నివేదికను సహాయ రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన మీదట మూడు రోజుల్లోపు తుది నివేదికను అందించాల్సి ఉంటుందన్నారు. ప్రధానంగా ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకోకుండా నిలువరించే వారిని, అలాగే ఓటర్లను ప్రభావితం చేసే వారిపై నిఘా పెట్టి ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని సూచించారు. అలాంటి పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక జాబితాలో చేరిస్తే, పోలీసుల సహాయంతో జిల్లా యంత్రాంగం తరపున ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ, ఎన్నికలలో ఓటర్లను ప్రభావితం చేసేలా నగదు, మద్యం, మత్తు పదార్థాలు, ఇతర సామాగ్రిని పంపిణీ చేసే అవకాశాలు ఉన్నందున, కట్టుదిట్టమైన నిఘా ఉంచాలన్నారు. క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాల పరిధిలోని ప్రాంతాలను సందర్శిస్తూ, స్థానికులతో క్రమం తప్పకుండా భేటీలు నిర్వహించడం ద్వారా వాస్తవ పరిస్థితులను తెలుసుకోవచ్చని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా గట్టి పోలీస్ బందోబస్తుతో భద్రతా ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు సిబ్బంది, సాయుధ బలగాలను మోహరిస్తామని అన్నారు. శిక్షణ తరగతుల్లో జిల్లా ఉప ఎన్నికల అధికారిని కృష్ణవేణి, ఆర్మూర్ ఆర్డీఓ వినోద్ కుమార్, ఏ.ఆర్.ఈ.ఓలు, సెక్టోరల్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కంటతడి పెట్టిస్తున్నా...సూసైడ్ నోట్..

**బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ఆత్మహత్య..**

బాసర/బైంసా,ఫిబ్రవరి 23(లోకంతీరు):నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో విషాదం చోటుచేసుకుంది.పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్న శిరీష (17) బలవన్మరణానికి పాల్పడింది.ఆమె ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారం కారణంగా పోలీసులు చెబుతున్నారు.ఈ విషాద ఘటన గురువారం (ఫిబ్రవరి 22) చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి జిల్లా మనూరు మండలం దవ్వూరుకు చెందిన తెనుగు శిరీష బాసర ట్రిపుల్ ఐటీలో పీయూసీ ఫస్టియర్ చదువుతుంది. బుధవారం తన ఇంటి నుంచి బయల్దేరిన శిరీష గురువారం వర్సిటీకి చేరుకుంది. అదే రోజు రాత్రి హాస్టల్లోని తన గది (రూం నెం 117)లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన హాస్టల్ సిబ్బంది బాలికను క్యాంపస్ హెల్త్సెంటర్కి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలిక మృతి చెందిందని నిర్ధారించారు. శిరీష మృతదేహాన్ని నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్టు క్యాంపస్ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శిరీష గదిని . గదిలో లభ్యమైన సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకుని ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు.శిరీష రాసిన సూసైడ్ నోట్లో పలు విషయాలు వెల్లడించింది. తాను ప్రాణంగా ప్రేమించిన బావ ఆకాశ్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నట్లు లేఖలో పేర్కొంది. బావ ఆకాశ్ మృతిని తట్టుకోలేకనే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖలో పేర్కొంది. నేను ఇలా చేయడం తప్పని తెలుసు. నన్ను క్షమించండి. మీరు బాధపడతారని తెలుసు. కానీ బావ లేని జీవితం నాకెప్పటికీ శూన్యమే. అందుకే నేను తన దగ్గరికి వెళ్లిపోతున్నా. బావ చావుకు కారణమైన వారిని వదలకండి. అలాగే నా చివరి కోరిక కూడా తీర్చండి. బావ చనిపోయాక చివరిసారి కూడా చూడలేదు. అందుకే నన్నూ బావని దహనం చేసిన చోటే కాల్చండి. ఇదే నా చివరికోరిక. ప్లీజ్ నాన్న. మేము బతికి ఉన్నప్పుడు మేము ఎలాగూ కలిసి ఉండలేకపోయాం. కనీసం చనిపోయాక అయినా కలిసి ఉంటాం. ఎవరికో భయపడి నేను చనిపోవడం లేదు. నాకు బావ ప్రేమ కావాలి. బావ లేకుండా ఉండలేను. నాకు నువ్వు, అమ్మ ఎంతో.. బావ కూడా అంతే నాన్న. తమ్ముడిని బాగా చూసుకో. అమ్మ జాగ్రత్త' అని శిరీష సూసైడ్ నోట్లో రాసింది.కుమార్తె రాసిన సూసైడ్ నోట్ చూసి ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. ఈ విషయం తెలిసి ఉంటే కూతురిని కంటికి రెప్పలా కాపాడుకునే వారం కదా అంటూ వారు విలపించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించాయి.


## నావల్నీ కుటుంబాన్ని పరామర్శించిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్



రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ సైబీరియన్ పీనల్ కాలనీ జైలులో కొన్ని రోజుల క్రితం అనుమానాస్పద రీతిలో మృతిచెందిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన కుటుంబాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (ఏనీవ ఃతిటవని) పరామర్శించారు. కాలిఫోర్నియాలోని ఓ హోటల్లో నావల్నీ భార్య యులియా, కుమార్తె దాశాని బైడెన్ కలిశారు ఈ సందర్భంగా వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నావల్నీ మృతి ఆ కుటుంబానికి తీరని లోటని అన్నారు.కాగా, సైబీరియన్ పీనల్ కాలనీలో ఉన్న నావల్నీ.. గత శుక్రవారం మరణించినట్లు అధికారులు చెప్పారు. జైలులో వాకింగ్కు వెళ్లిన నావల్నీ కింద కూలిపడ్డారు. ఆ తర్వాత ఆయన మళ్లీ లేవలేదట. నావల్నీ మరణవార్త విన్న తర్వాత .. ఆ జైలుకు ఆయన తల్లి, లాయర్ వెళ్లారు. కానీ ఇప్పటి వరకు నావల్నీ మృతదేహాన్ని చూపించేందుకు జైలు మార్చురీ అధికారులు నిరాకరించారు.అయితే, నావల్నీ మృతదేహాన్ని దాచిపెట్టారని ఆయన భార్య ఆరోపిస్తున్నారు. తన భర్తను అధ్యక్షుడు పుతిన్ హత్య చేశారని యులియా ఆరోపిస్తున్నారు. ఫ్రీ రష్యా ఉద్యమంపై ఆమె ఓ వీడియోను రిలీజ్చేశారు. నరాలను దెబ్బతీసే నోవిచోక్ అనే విషపూరిత ఏజెంట్ను తన భర్తపై ప్రయోగించారని, శరీరం నుంచి ఆ విషం వెళ్లే వరకు నావల్నీ పార్థీవదేహాన్ని అప్పగించబోరని యులియా ఆరోపించారు.

## ఒకదానికొకటి ఢీకొన్న 100కుపైగా వాహనాలు.. పలువురికి గాయాలు

చైనాలో ప్రమాదం చోటు చేసుకుంది ఓ హైవేపై దాదాపు వందకు పైగా కార్లు ఒకదానికొకటి ఢీ కొన్నాయి ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు.స్థానిక మీడియా నివేదికల ప్రకారం.. చైనాలో ప్రస్తుతం అతిశీతల వాతావరణం నెలకొంది. దీంతో విపరీతంగా మంచు పడుతోంది. సుజౌ నగరంలోని ఎక్స్ప్రెస్వేపై కూడా విపరీతమైన మంచుపడింది. రోడ్డుపై వాహనాలు కనిపించని పరిస్థితి. ఈ క్రమంలో సుజౌ ఇండస్ట్రియల్ పార్క్ సమీపంలో సుమారు 100కి పైగా కార్లు ఒకదానికొకటి బలంగా ఢీ కొన్నాయి. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకుంది.ఈ ఘటనలో పలు వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయాలపాలయ్యారు. రంగంలోకి దిగిన అధికారులు క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రమాదం కారణంగా ఆ రోడ్డుపై కార్లన్నీ చెల్లాచెదురుగా పడటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. అధికారులు ట్రాఫిక్ను క్లియర్ చేస్తున్నారు.



## ముందుకు సాగని..బ్యాక్ వాటర్ పనులు

నల్గొండ, ఫిబ్రవరి 23, (న్యూస్ పల్స్) కరవు పీడిత నల్గొండ జిల్లాకు సాగునీరు అందించాలన్న దశాబ్దాల కల ఇంకా కలగానే మిగిలిపోయింది. ఆ కలతీరడానికి ఉమ్మడి నల్గొండ రైతంగా ఇంకా ఎదురుచూపుల్లోనే గడుపుతోంది.శ్రీశైలం బ్యాక్ వాటర్ ను వినియోగించుకుని నల్గొండ జిల్లాలో ప్రధానంగా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీటిని, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు తాగునీటి అందించాల్సిన శ్రీశైలం ఎడమగట్టు బ్రాంచ్ కెనాల్ (ఎస్.ఎల్.బి.సి) ప్రాజెక్ట్ పరిస్థితి ఒక అడుగు ముందుకు, వంద అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది.ఎస్.ఎల్.బి.సి టన్నెల్ ప్రాజెక్టు ప్రతిపాదనలు, శంకుస్థాపనల చరిత్ర చాలా పాతది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక మొదలైన సాగునీటి ప్రాజెక్టుల జలయజ్ఞం లో భాగంగా కార్యరూపం దాల్చింది.3లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో రూ.1925కోట్ల అంచనాతో పనులు మొదలయ్యాయి. నిర్ణీత గడువు మేరకు ప్రాజెక్టు పనులు మొదలయ్యాక నాలుగేళ్లకు పూర్తికావాల్సి ఉన్నా ఇప్పటికీ అతీగతీ లేకుండా పోయింది.2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ (నాటి టీఆర్ఎస్) ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఉన్నా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఈ ప్రాజెక్టులో కాల్వలు తవ్వాల్సిన ప్రాంతమంతా నల్లమల రిజర్వు అటవీ ప్రాంతంలో ఉండడంతో ప్రాజెక్టు పట్టాలు ఎక్కడానికి ప్రతిబంధకంగా మారింది.శ్రీశైలం సొరంగ మార్గం ప్రాజెక్టు ముందుకు పడే అవకాశం కనిపించక పోవడంతో నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్ నుంచి నీటిని ఎత్తిపోయడం ద్వారా నల్గొండ జిల్లాకు సాగు, తాగునీరు, హైదరాబాద్ నగరానికి తాగునీటిని అందించే ఉద్దేశంతో ఎలిమినేటి మాధవరెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు (అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ /ఎ.కె.బి.ఆర్) ను మొదలు పెట్టి పూర్తి చేశారు.ఎ.ఎం.ఆర్.పిని పూర్తి చేసే నాటికి ఆసియా ఖండంలో అతి ఎత్తైన ఎత్తిపోతల పథకంగా దీనికి పేరు వచ్చింది. నిర్వహణా భారం కూడా ఎక్కువగా ఉండడంతో ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం ఒక్కటే పరిష్కారమని భావించారు. 1983లో ఎ.ఎం.ఆర్.పిని మొదలు పెడితే ఇరవై ఏళ్లు గడిచాక 2004లో ఎస్.ఎల్.బి.సి పనులు మొదలయ్యాయి.శ్రీశైలం ఎడమగట్టు బ్రాంచ్ కెనాల్ ప్రాజెక్టును 2004లో చేపట్టినా ఇంకా పెండింగులోనే ఉంది. నీటిని తీసుకుని నల్గొండ జిల్లా పరిధిలోని చందంపేట మండలం తెల్దేవర్ పల్లి వద్ద నీటిని బయటకు పోయడానికి మొత్తంగా సుమారు 44 కిలోమీటర్ల (43.930కి.మీ) మేర సొరంగం తవ్వాల్సి వచ్చింది.వైపు ఇన్ లెట్ 13.9కి.మీ నిడివిలో, నల్గొండ జిల్లా చందంపేట మండలంలో ఔట్ లెట్ కు 20.4 కిమీటర్ల నిడివిలో సొరంగాలు తవ్వాలి. దీనికి కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి. టన్నెల్ బోర్ మిషన్ (టీబీఎం)ను తెప్పించారు. ఇది రెండు సార్లు శ్రీశైలానికి భారీ వదలు వచ్చిన సమయంలో నీటిలో మునిగిపోయి మరమ్మతులు గురైంది.అన్ని అడ్డంకులు అధిగమించినా.. బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దగా ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు. దీంతో కాంట్రాక్టు సంస్థ కూడా చేతులు ఎత్తేసింది. చివరకు ప్రాజెక్టు పనులకు వినియోగించే కరెంటు చార్జీలు కూడా భారీగా పేరుకుపోయి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కేవలం విద్యుత్తు బిల్లులకు రూ.59 కోట్ల బకాయిలు ఉన్నాయంటే ప్రభుత్వ చిత్తశుద్దిని అర్థం చేసుకోవచ్చని ఈ ప్రాంత రైతు ఉద్యమ నాయకులు పేర్కొంటున్నారు.ఎస్.ఎల్.బి.సి ప్రాజెక్టును రూ.1925 కోట్ల అంచనాతో మొదలు పెడితే.. అదిప్పుడు రూ.4,900కోట్లకు పెరిగింది. ఇప్పటి దాకా ప్రాజెక్టు కోసం రూ.2700 కోట్ల ఖర్చు చేశారు. మరో రూ.2200 కోట్ల నిధుల అవసరం ఉంది. ఈ పరిస్థితుల్లో జిల్లాకు చెందిన సాగునీటి శాఖా మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయడంపై శ్రద్ధ పెడుతున్నా.. కనీసం ఈ అయిదేళ్లలో పనులు పూర్తవుతాయా అన్న అనుమానాలు ఈ ప్రాంత రైతుల మదిని తొలుస్తోంది.


## హుజూరాబాద్ లో మంత్రి పొన్నం పర్యటన

కరీంనగర్,హుజూరాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. అయన స్థానిక నేతలు ఘన స్వాగతం పలికారు. తరువాత మంత్రి వీణవంక మండల కేంద్రంలో సమ్మక్క సారలమ్మ లను దర్శించుకున్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల దర్శనం చేసుకున్నాం. అమ్మవార్ల ఆశీర్వాదం అందరి మీద ఉండాలి. రాబోయే కాలంలో సమృద్ధిగా వర్షాలు పడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవార్లను ప్రార్థించానని అన్నారు,.అమ్మవారి ఆశీర్వాదంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియంతృత్వం కి వ్యతిరేకంగా ప్రజా పాలన ఏర్పడింది. ఈ ప్రజా పాలన కొంత మంది 70 రోజులు కాకముందే ప్రగల్భాలు పలుకుతున్నరు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి. ప్రభుత్వం కూలిపోతుందని ఒకడు కులగొడతామని ఒకడు..నీటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. ఆయా ప్రభుత్వాలు 10 సంవత్సరాలు అధికారంలో ఉండి తెలంగాణ కి చేసింది ఏముంది. మమ్మల్ని ప్రశ్నించే ముందు దళిత ముఖ్యమంత్రి ,డబుల్ బెడ్రూం ,నిరుద్యోగ భృతి అమలు చేశారా. నియంత్రుత్వంతో స్వేచ్ఛ లేకుండా ప్రశ్నించే గొంతు లేకుండా బతికేటువంటి పరిస్థితి లేకుండే. మా ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణం ముళ్ళ కంచెలు బద్దలు కొట్టాం. ప్రజలందరికీ ఉపయోగంలో ఉండే విధంగా మా పరిపాలన కొనసాగిస్తున్నామని అన్నారు.



# సినిమా తీరు


# మహేశ్ బాబుకు కొత్తగా మేకోవర్



కొత్త సినిమా కోసం మహేశ్ బాబును కొతత్గా చూపాలని స్టార్ డైరెక్టర్ రాజమౌళి యోచిస్తున్నారు. అందుకోసం మహేశ్ బాబును కేవలం షూటింగ్‌కే పరిమితం చేయాలని, బయటకనపకుండా చూడాలిన అనుకుంటున్నాడట. అందుకే అతను ఇక పబ్లిక్ గా కనిపించరాదని ఆంక్షలు పెట్టారని టాక్ నడుస్తోంది. మహేష్ బాబు ఎలాంటి ఈవెంట్స్ కు కానీ, మూవీ ఫంక్షన్స్ కు హాజరుకాకూడదని ఆదేశాలు జారీ చేశారట. ఇప్పుడు ఇదే న్యూస్ టాలీవుడ్ లో చక్కర్లు కొడుతుంది. ఇకపై మహేష్ బాబు పబ్లిక్‌గా కనిపించకూడదని ఎస్ఎస్ రాజమౌళి చెప్పినట్లు టాక్ వినిపిస్తుంది. మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్స్ లో సినిమా రాబోతున్న విషయం తెలిసిందే..

### కొత్త సినిమా షూట్‌తో రాజమౌళి ఆంక్షలు

ఈ సినిమా కోసం మహేష్ బాబు అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమా పాత్ర కోసం మహేష్ బాబు గెటప్ మార్చనున్నారు. అలాగే బాడీ బిల్డింగ్ కూడా చేయబోతున్నాడు. ఆయన కొత్త గెటప్ ఎలా ఉంటుందో జనాలకు తెలియకూడదు. అందుకే మహేష్ బాబు పబ్లిక్‌గా కనిపించవద్దని రాజమౌళి రూల్ పెట్టారని టాక్. మిగతా దర్శకులతో పోలిస్తే రాజమౌళి వర్క్ స్టైల్ చాలా డిఫరెంట్ గా ఉంటుంది. జక్కన్న సినిమాలు తీయడానికి చాలా సమయం తీసుకుంటాడు. అందుకు తగ్గట్టుగానే హీరోల లుక్స్ ను కూడా మార్చేస్తుంటారు ఇప్పుడు మహేష్ బాబు లుక్ ను కూడా మారుస్తున్నారట దర్శకుడు రాజమౌళి. అందుకు తగ్గట్టుగానే మహేష్ బాబు విదేశాలకు వెళ్లి మరీ శిక్షణ పొందుతున్నాడు. మహేష్ బాబు నటించిన 'గుంటూరు కారం' సినిమా హిట్ అయినా కూడా అది మహేష్ బాబు అభిమానులకు ఆశించిన స్థాయిలో కిక్ ఇవ్వలేకపోయింది. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా మహేష్ బాబు కెరీర్‌లోనే బిగెస్ట్ మూవీగా నిలవనుంది. రాజమౌళి ఈసారి తన టెక్నికల్ టీమ్ లో కొన్ని మార్పులు చేయనున్నాడని అంటున్నారు. దాంతో సినీవర్గాల్లో క్యూరియాసిటీ మరింత పెరిగింది.




# మధుమేహ వ్యాధిగ్రస్తులు డ్రై ఫ్రూట్స్ తినవచ్చా? ఎలాంటివి తినవచ్చో తెలుసుకుని తినండి!



మధుమేహానికి ప్రధాన కారణం జీవనశైలి మరియు ఆహారపు అలవాట్లు. మధుమేహం అనేది రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండే పరిస్థితి. నేడు చాలా మంది మధుమేహంతో బాధపడుతున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. చక్కెర తక్కువగా మరియు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉన్న ఆహారాన్ని ఎంచుకోండి. దీనితో పాటు ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. సహజంగా ఎండిన పండ్లలో ఉన్న నీటి శాతం తాజా పండ్లలా కాకుండా తొలగించబడుతుంది. అయితే ఇవి చివరికి అధిక సాంద్రీకృత పోషకాల మూలంగా మారతాయి. కాబట్టి తాజా పండ్లు మరియు ఎండిన పండ్లు రెండూ ఆహారంలో ముఖ్యమైన పోషకాలను అందిస్తాయి. డ్రై ఫ్రూట్స్ ఆహారంలో తమ స్థానాన్ని కలిగి ఉన్నప్పటికీ, షుగర్ స్పైక్‌లను నివారించడానికి ఈ డ్రై ఫ్రూట్‌లను ఎలా కలపాలో అర్థం చేసుకోవడం కూడా చాలా ముఖ్యం. అదే మనం ఈ పోస్ట్‌లో చూడబోతున్నాం.. డ్రై ఫ్రూట్స్ షుగర్ లెవెల్స్‌ను ప్రభావితం చేస్తాయా? మధుమేహ వ్యాధిగ్రస్తులు ఏదైనా ఆహారాన్ని తిన్నప్పుడు, ఎండిన పండ్లతో సహా ఆహారంలో లభించే చక్కెరలు లేదా కార్బోహైడ్రేట్లు విచ్ఛిన్నమవుతాయి మరియు గ్లూకోజ్ అణువులుగా రక్తప్రవాహంలోకి విడుదలవుతాయి. ఈ అణువులు మీ శరీరానికి పోషకాలు మరియు శక్తిని అందించడంలో సహాయపడతాయి. డయాబెటిక్ కాని వ్యక్తి కార్బోహైడ్రేట్ భోజనం తిన్నప్పుడు, ప్యాంక్రియాస్ ఇన్సులిన్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఇది రవాణా కోసం గ్లూకోజ్ నిల్వ మరియు ఉపయోగించడానికి సహాయపడుతుంది. అందుకే మధుమేహ వ్యాధిగ్రస్తులు తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేరు లేదా ఉపయోగించలేరు. వారు రక్తంలో చక్కెరను నియంత్రించడానికి మందులు తీసుకోవాలి. అదే సమయంలో, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచడానికి ఇన్సులిన్ యొక్క సరైన మోతాదు ఇవ్వడానికి కార్బోహైడ్రేట్ తీసుకోవడం జాగ్రత్తగా పర్యవేక్షించాలి. డ్రై ఫ్రూట్స్‌లో విటమిన్లు, మినరల్స్, ఫైబర్ మరియు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నప్పటికీ, మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలపై శ్రద్ధ వహించాలి. ఫైబర్ అధికంగా ఉండే డ్రై ఫ్రూట్‌లను ఎంచుకోండి. ఫైబర్ నెమ్మదిగా జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలపై తక్కువ ప్రభావాన్ని చూపుతుంది. అలాంటి డ్రై ఫ్రూట్స్ ఏంటో, వాటి పోషక విలువలు ఏమిటో చూద్దాం. మధుమేహ వ్యాధిగ్రస్తులు డ్రై ఫ్రూట్స్ తినడం వల్ల కలిగే ప్రయోజనాలు మధుమేహ వ్యాధిగ్రస్తులు డ్రై ఫ్రూట్స్ తినడం ద్వారా వారి ఆహార నాణ్యతను మెరుగుపరుచుకోవచ్చు. 2021లో జర్నల్ ఆఫ్ ది అకాడమీ ఆఫ్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్‌లో ప్రచురించబడిన క్రాస్ సెక్షనల్ అధ్యయనంలో ఎండిన పండ్లను తినని వ్యక్తుల కంటే ఎండిన పండ్లను తినే వ్యక్తులు అధిక ఆహార నాణ్యత మరియు పోషకాలను తీసుకుంటారని కనుగొన్నారు. ఆహారం తీసుకోవడం మెరుగుపరచడానికి పొటాషియం కలిగి ఉన్న డ్రైఫ్రూట్స్ వంటి ఆహారాలపై దృష్టి పెట్టడం ముఖ్యం. ఆ రోజుల్లో ఎక్కువ క్యాలరీలు తీసుకునే స్థాయిని కలిగి ఉన్నందున దానికి డ్రై ఫ్రూట్స్ జోడించేటప్పుడు జాగ్రత్త వహించాలి. డయాబెటిక్ రోగులకు డ్రై ఫ్రూట్స్ ఎలా ఎంచుకోవాలి? జోడించిన చక్కెర మొత్తం కోసం ప్యాకెట్‌లోని పట్టికను తనిఖీ చేయండి. ఇందులో 0 ఉండాలి. ఇతర జోడించిన పదార్థాలను చూసిన తర్వాత పదార్థాలను రక్షించడానికి సంరక్షణకారుల కోసం కూడా తనిఖీ చేయండి. తాజాదనాన్ని కాపాడుకోవడానికి సుక్రోజ్, ఫ్రక్టోజ్ కార్న్ సిరప్ లేదా ప్రత్యామ్నాయ జోడించిన చక్కెర మూలం జోడించబడిందని నిర్ధారించుకోండి. మీకు అవసరమైన ప్రయోజనాలను పొందడానికి, పోషకాలు అధికంగా ఉండే పోషకమైన ఆహారాన్ని అనుసరించండి. చక్కెర తక్కువగా ఉండే డ్రై ఫ్రూట్స్ ఏమిటి? బాదం మధుమేహ వ్యాధిగ్రస్తులకు గింజల విషయానికి వస్తే, బాదంపప్పులు మొదటి స్థానంలో ఉన్నాయి. మధుమేహం ప్రారంభ దశలో ఉన్నవారికి మరియు అధిక రక్తంలో చక్కెర ఉన్నవారికి బాదం ఒక అద్భుతమైన చిరుతిండి. ఎందుకంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బాదంపప్పులో ఫైబర్, విటమిన్ ఇ, మెగ్నీషియం మరియు విటమిన్ బి12 కూడా పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది ఆరోగ్యకరమైన చిరుతిండి. పిస్తాపప్పు పిస్తాలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులు, ముఖ్యంగా టైప్-2 మధుమేహ వ్యాధిగ్రస్తులు పిస్తాలను స్నాక్స్‌గా తినవచ్చు. పిస్తాలో ఫైబర్ మరియు ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా పుష్కలంగా ఉంటాయి. టైప్-2 మధుమేహ వ్యాధిగ్రస్తులు 4 వారాల పాటు పిస్తాపప్పులు తీసుకుంటే, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు గణనీయంగా తగ్గాయని మరియు మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయని ఒక అధ్యయనం కనుగొంది. కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులు రోజూ కొద్దిగా పిస్తా తినవచ్చు. అక్రోట్లను వాల్‌నట్స్‌లో ఒమేగా-3లు పుష్కలంగా ఉండే అద్భుతమైన గింజలు. ఈ వాల్‌నట్స్‌లో ప్రొటీన్‌తో పాటు పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు కూడా ఉంటాయి. వాల్‌నట్స్‌లోని బహుళఅసంతృప్త కొవ్వులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి

# శ్రీవల్లి 2.0 అంతకు మించి...!

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న పుష్ప 2 పై అంచనాలు భారీగా ఉన్నాయి. మొదటి పార్ట్ లో నటనకు గాను అల్లు అర్జున్ జాతీయ అవార్డును సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. పుష్ప 2 లో అల్లు అర్జున్ అంతకు మించి అన్నట్లుగా నటిస్తున్నాడని, ఆయన పాత్రను అద్భుతంగా దర్శకుడు సుకుమార్ డ ఇజైన్ చేశాడని వార్తలు వస్తున్నాయి. రోజులుగా హీరోయిన్ శ్రీవల్లి పాత్ర గురించి పెద్దగా చర్చ జరగలేదు. కానీ తాజాగా చిత్ర యూనిట్ సభ్యుల నుంచి అందుతున్న లీక్ అనుసారం పుష్ప 2 లో శ్రీవల్లి పాత్ర కు చాలా ప్రాముఖ్యత ఉంటుందట. నటనకు ఆస్కారం ఉన్న పాత్ర లో ఆమె కనిపించబోతుందని యూనిట్ సభ్యులు చెబుతు న్నారు. అయితే రెండో పార్ట్ లో గర్భవతిగా కనిపించబోతుందని, తల్లి సెంటిమెంట్ సన్నివేశాల్లో కూడా ఆమె కనిపించబోతుందనే వార్తలు వస్తున్నాయి. మొత్తానికి శ్రీవల్లి ని మొదటి పార్ట్ తో పోల్చితే అంతకు మించి అన్నట్లుగా పుష్ప 2 లో ఉ ండబోతుందట. యానిమల్ సినిమాలో రష్మిక మందన్న పాత్ర కు మంచి మార్కులు దక్కాయి. ఆ సినిమాలో రష్మిక నటన విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. అందుకే దర్శకుడు సుకుమార్ పుష్ప 2 లో కూడా ఆమె నటనతో ప్రేక్షకులను సర్ ప్రైజ్ చేసే విధంగా ప్లాన్ చేస్తున్నాడనే వార్తలు వస్తున్నాయి. రష్మిక మందన్న ఈ మధ్య కాలంలో వరుసగా పాన్ ఇండియా ప్రాజెక్ట్ లతో బిజీ అవుతోంది. పుష్ప తో పాన్ ఇండియా స్థాయిలో ఆకట్టుకున్న రష్మిక పుష్ప 2 తో మరింతగా స్టార్ డమ్ దక్కించుకోవడం ఖాయం. పుష్ప 2 సూపర్ హిట్ అయితే రష్మిక తన పారితోషికంను భారీగా పెంచే అవకాశాలు ఉన్నాయి.




## అందానికే మరో అందం....



# 'దేవర'ని అనిరుధ్ రానిచ్చేనా?

ఎన్టీఆర్ ఫ్యాన్స్ తో పాటు అందరు కూడా 'దేవర' సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న దేవర సినిమా పై ఆకాశమే హద్దు అన్నట్లుగా అంచనాలు ఉన్న విషయం తెల్సిందే. జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ముందుగా అనుకున్న ప్రకారం ఈ సినిమాను ఏప్రిల్ లో విడుదల చేయాల్సి ఉంది. కానీ షూటింగ్ పార్ట్ పూర్తి అవ్వక పోవడంతో పాటు వీఎఫ్ఎక్స్ కు ఎక్కువ సమయం తీసుకుంటున్నారు. అందుకే ఏకంగా అక్టోబర్ కి సినిమాను వాయిదా వేస్తూ ఇటీవలే అధికారికంగా ప్రకటన వచ్చిన విషయం తెల్సింద శ్రీలీల అక్టోబర్ 10న అయినా ఈ సినిమా వస్తుందా అనే అనుమానాలను కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే దేవర సినిమా కోసం సంగీత దర్శకుడు అనిరుధ్ ఇంకా పూర్తి స్థాయిలో వర్క్ ను మొదలు పెట్టలేదట. కొరటాల శివ మరియు అనిరుధ్ కాంబో మొదటి సారి అవ్వడం వల్ల మ్యూజిక్ సిట్టింగ్స్ కు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. దేవర సినిమా మాత్రమే కాకుండా అనిరుద్ చేతిలో డజను సినిమాలు ఉంటాయి. కనుక ఆయన ఎక్కువ సమయం కేటాయించడం కష్టం అంటూ స్వయంగా యూనిట్ సభ్యులు మాట్లాడుకుంటూ ఉన్నారు. అదే నిజం అయితే దేవర సినిమా మళ్లీ వాయిదా పడ్డా ఆశ్చర్యం లేదు. దేవర సినిమా షూటింగ్ ముగింపు దశకు వచ్చింది. అనిరుధ్ పాటలు పూర్తి చేసి ఇస్తే వాటిని కూడా షూట్ చేస్తారు. అలాగే బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో పాటు రీ రికార్డింగ్ విషయంలో కూడా అనిరుధ్ స్పీడ్ గా వర్క్ చేస్తే తప్ప అక్టోబర్ లో దేవర వచ్చే అవకాశం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మరి దేవర ను అనిరుధ్ రానిచ్చేనా చూడాలి.



# ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్.. అప్పటి వరకు రిషబ్ పంత్ సేవలు మిస్?

ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషబ్ పంత్ అభిమానులకు ఓ శుభవార్త, ఓ చెడు వార్త వచ్చింది. ఎఖఒ షెడ్యూల్‌ను ప్రకటించిన వెంటనే, ప్రతి అభిమాని వారి వారి ఫ్రాంచైజీలకు మద్దతు ఇవ్వడం ప్రారంభించారు.ఇటువంటి పరిస్థితిలో, ప్రమాదం తర్వాత ఎఖఒ 2024తో తిరిగి మైదానంలోకి వచ్చిన రిషబ్ పంత్ కూడా ఈ సీజన్ కోసం చాలా ఉత్సాహంగా ఉన్నాడు. పంత్ 2024 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. దీనిని ఫ్రాంచైజీ సహ యజమాని పార్థ్ జిందాల్ ధృవీకరించిన సంగతి తెలిసిందే.ఇఎస్‌పిఎన్‌క్రిక్‌ఇన్‌ఫోతో జరిగిన ప్రత్యేక సంభాషణలో జిందాల్ మాట్లాడుతూ పంత్ ఢిల్లీకి కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని, అయితే టోర్నమెంట్ ప్రథమార్థంలో వికెట్ కీపింగ్ చేయడని చెప్పాడు. అలాగే మార్చి 23న పంజాబ్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ ఎన్రిక్ నార్కీ ఫిట్‌గా ఉంటాడని జిందాల్ తెలిపాడు. పంత్ కెప్టెన్‌గా ఐపీఎల్‌ను ప్రారంభిస్తాడనే నమ్మకంతో జట్టు డైరెక్టర్ సౌరవ్ గంగూలీ, హెడ్ కోచ్ రికీ పాంటింగ్ ఉన్నారని జిందాల్ ప్రకటించాడు. అయితే, అప్పటికి అతను ఫిట్‌నెస్‌కు సంబంధించి బీసీసీఐ నుంచి క్లీన్ చిట్ పొందాల్సి ఉంటుంది.పంత్ బ్యాటింగ్ చేస్తున్నాడని, రన్నింగ్‌తోపాటు వికెట్ కీపింగ్ కూడా ప్రారంభించాడని జిందాల్ తెలిపాడు. ఇటువంటి పరిస్థితిలో, అతను ఎఖఒ వరకు పూర్తిగా ఫిట్‌గా ఉంటాడని, తొలి మ్యాచ్ నుంచి ఢిల్లీకి కెప్టెన్సీ చేస్తాడని ఆశిస్తున్నట్లు తెలిపాడు. మొదటి 7 మ్యాచ్‌ల్లో అతడిని బ్యాట్స్‌మెన్‌లా ఆడిస్తాం, అతని శరీరం ఎలా స్పందిస్తుందో చూద్దాం అంటూ చెప్పుకొచ్చాడు.2022 డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌లో జరిగే టెస్ట్ సిరీస్ తర్వాత పంత్ ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌కు తిరిగి రానున్నాడు. డిసెంబర్ 30, 2022న కారు ప్రమాదం తర్వాత, పంత్ తన కుడి మోకాలిలోని మూడు స్నాయువులకు విజయవంతమైన శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఆ పరిస్థితి నుంచి ప్రస్తుతం కోలుకున్నాడు. అప్పటి నుంచి పంత్ చాలా మెరుగయ్యాడు. పంత్ ఇటీవల బెంగళూరులో ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు.మంగళవారం, పంత్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో వికెట్ కీపింగ్, మొబిలిటీ డ్రిల్స్ చేస్తున్న వీడియోను కూడా పోస్ట్ చేశాడు. బుధవారం, అతను 20 ఓవర్ల మ్యాచ్‌లో బ్యాటింగ్, ఫీల్డింగ్ చేశాడు. అతనిపై బీసీసీఐ నిశితంగా నిఘా ఉ ంచింది. క్యాపిటల్స్‌లో చేరడానికి ముందు పంత్ మరికొన్ని ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడతాడని భావిస్తున్నారు. ఃఅఐ ఆమోదించిన తర్వాత, అతను విశాఖపట్నంలో శిక్షణా శిబిరంలో జట్టులో చేరతాడు. అక్కడ జట్టు రెండు హోమ్ మ్యాచ్‌లు కూడా ఆడుతుంది.



# ఇంగ్లాండ్ జట్టుకు మరోషాక్.. టెస్ట్ సిరీస్ నుంచి తప్పుకున్న యంగ్ ప్లేయర్.. కారణం ఏంటంటే?

భారత్-ఇంగ్లండ్‌ల మధ్య టెస్టు సిరీస్‌లో భాగంగా నాల్గవ మ్యాచ్ ఫిబ్రవరి 23 శుక్రవారం నుంచి రాంచీలో ప్రారంభమైంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు, బెన్ స్టోక్స్ సారథ్యంలోని ఇంగ్లండ్ జట్టు యువ స్పిన్నర్ రెహాన్ అహ్మద్‌ను టెస్ట్ సిరీస్‌కు దూరమయ్యాడు.టెస్టు సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లు ఆడిన లెగ్ స్పిన్నర్ రెహాన్, రాంచీ టెస్టుకు ముందు అకస్మాత్తుగా జట్టును వదిలి తన దేశం బ్రిటన్‌కు తిరిగి వెళ్లాడు. నివేదికల ప్రకారం, రెహాన్ కుటుంబ అత్యవసర విషయం కారణంగా శుక్రవారం భారతదేశం నుంచి తిరిగి వెళ్లాడు.రాంచీ టెస్టు మ్యాచ్‌లో టాస్ అనంతరం రెహాన్ అహ్మద్ టెస్టు సిరీస్‌కు దూరమైనట్లు వచ్చాయి. ఈ మ్యాచ్‌కు ఒక రోజు ముందు ఇంగ్లండ్ తమ ప్లేయింగ్ ఎలెవన్‌ని ప్రకటించింది. అందులో రెహాన్‌కు చోటు దక్కలేదు. అంతకు ముందు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ప్రత్యేక ప్రదర్శన చేయలేకపోయాడు.నివేదిక ప్రకారం, ప్లేయింగ్ ఎలెవెన్ ప్రకటించిన తర్వాత మాత్రమే, రెహాన్ ఇంటికి తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇంగ్లీష్ మీడియా తన ఇంటికి అంటే బ్రిటన్‌కు తిరిగి వస్తున్నాడు. కుటుంబంలో కొన్ని అత్యవసర విషయాల కారణంగా, 19 ఏళ్ల లెగ్ స్పిన్నర్ స్వదేశానికి తిరిగి రావాల్సి ఉందని, ధర్మశాలలో జరిగే సిరీస్‌లోని చివరి మ్యాచ్‌కు కూడా తిరిగి రాలేదని ఃఃఅ నివేదిక పేర్కొంది.ఈ సిరీస్‌లో రెహాన్ అహ్మద్ ప్రదర్శన ప్రత్యేకంగా ఏమీ లేదు. తొలిసారి భారత్‌లో పర్యటించిన అనుభవం లేని లెగ్ స్పిన్నర్ 3 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు మాత్రమే పడగొట్టాడు. వీటిలో విశాఖపట్నం టెస్టులో 6 వికెట్లు తీశాడు. అయినప్పటికీ, అతను ఖచ్చితంగా లోయర్ ఆర్డర్‌లో ఇంగ్లండ్ కోసం కొన్ని కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు.రాంచీ టెస్టులో టాస్ గెలిచిన ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.